క్లుప్తంగా

రాష్ట్రస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక


ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

బత్తలపల్లి: అన్నమయ్య, తూర్పుగోదావరి జిల్లాల్లో త్వరలో జరిగే స్కూల్ గేమ్స్ రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు రామాపురం ఉన్నత పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయులు వెంకటనాయుడు, ఫిజికల్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ తెలిపారు. సోమవారం రామాపురం ఉన్నత పాఠశాలలో వారు విలేకర్లతో మాట్లాడుతూ అండర్–14 బాలికల విభాగంలో ప్రణీత, అండర్–17 బాల బాలికల విభాగంలో ఇబ్రహీం, చందన, ధనుష్ ఎంపికయ్యారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

పాత కమీషన్ పునరుద్ధరించాలి

కదిరి అర్బన్: పట్టణంలోని ఎల్ఐసీ కార్యాలయం వద్ద ఏజెంట్లు సోమవారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు పాత కమీషన్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. పాలసీదారులకు బోనస్ పెంచి తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు. క్లాబ్యాక్ కమీషన్ సిస్టం ఖండిస్తున్నామన్నారు. లక్ష రూపాయల పాలసీని పునరుద్ధరించాలన్నారు.

మద్దిలేరు వంతెన పరిశీలన


వంతెనను పరిశీలిస్తున్న ఆర్డీఓ మహేష్

ముదిగుబ్బ: మండల పరిధిలోని కొడవండ్లపల్లి, గంగిరెడ్డిపల్లి గ్రామాల మధ్యన ఉన్న మద్దిలేరు వంతెనను సోమవారం ఆర్డీఓ మహేష్ పరిశీలించారు. చిత్రావతి నదిపై నిర్మించిన మద్దిలేరు వంతెన గతంలో వచ్చిన భారీ వర్షాలకు తెగిపోయింది. అప్పట్లో తాత్కాలికంగా మట్టిని వేసి మరమ్మతులు చేశారు. అయితే ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వంతెన తెగే పరిస్థితులు ఉండవచ్చని ముందస్తుగా పరిశీలించారు. నదీ పరివాహకప్రాంత వాసులు జాగ్రత్తగా ఉండాలని ఆయన సూచించారు. ఆర్డీఓ వెంట డిప్యూటీ తహసీల్దార్ నారాయణస్వామి ఉన్నారు.

అన్న క్యాంటీన్ ప్రారంభం


భోజనాలు వడ్డిస్తున్న ప్రజాప్రతినిధులు

కదిరి టౌన్: పట్టణంలోని ఆర్అండ్‌బీ కార్యాలయం పక్కన అన్న క్యాంటీన్‌ను ఎంపీ బీకే పార్థసారథితో కలిసి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ సోమవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద ప్రజల కోసం అన్న క్యాంటీన్‌లో రూ.5కే భోజనం అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఎంఎస్ పార్థసారథి, మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యత లేకుంటే బిల్లులు రావు


పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సునీత

కనగానపల్లి: గ్రామాల్లో చేపట్టే సీసీ రోడ్డు పనులు నాణ్యతగా లేకపోతే బిల్లులు మంజూరు చేయమని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత కాంట్రాక్టర్లను హెచ్చరించారు. మండలంలోని దాదులూరులో సోమవారం ఆమె పల్లె పండుగ వారోత్సవాలను ప్రారంభించారు. ఉపాధి పథకం కింద చేపట్టే సీసీ రోడ్డు పనులకు భూమి చేశారు. కార్యక్రమంలో పీఆర్ డీఈ లక్ష్మీనారాయణ, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ అనిల్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్, ఏపీఓ వెంకటేష్‌నాయక్, ఏపీఎం హేమలత పాల్గొన్నారు.

వస్త్రదానం

ధర్మవరం రూరల్: గొట్లూరు అనాథాశ్రమంలోని వృద్ధులు, అనాథలకు సోమవారం ఫైర్ ఆఫీసర్ వెంకట నాగేంద్ర, లావణ్య దంపతులు వస్త్రదానం చేశారు. తమ కుమారుడు వెంకటసాయి పుట్టిన రోజు సందర్భంగా వస్త్రదానం, అన్నదానం చేసినట్లు చెప్పారు.

లేబర్ ఆఫీస్ ఏర్పాటు చేయాలి

ధర్మవరం: డివిజన్‌కు సంబంధించి అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ కార్యాలయాన్ని ధర్మవరంలో ఏర్పాటు చేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక గాంధీనగర్‌లోని గాంధీ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. సీఐటీయూ మండల కన్వీనర్ జేవీ రమణ, కోకన్వీనర్ అయూబ్ ఖాన్ మాట్లాడుతూ శ్రీసత్యసాయి జిల్లా ఏర్పాటు అనంతరం ధర్మవరంలోని అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ కార్యాలయాన్ని కొత్తచెరువుకు తరలించారన్నారు. ధర్మవరం డివిజన్‌కు సంబంధించి అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ కార్యాలయాన్ని ధర్మవరంలోనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ప్రాంతంలో దాదాపు 50వేల మంది కార్మికులు ఉన్నారని తెలిపారు.

కూటమి వర్గీయులకే కిక్కు

- 80 శాతానికి పైగా షాపులు వారికే



ధర్మవరం: మద్యం షాపుల లైసెన్సులకు సోమవారం జిల్లా కేంద్రం పుట్టపర్తిలో నిర్వహించిన లాటరీ ప్రక్రియ సజావుగా సాగింది. ఇందులో ధర్మవరం నియోజకవర్గంలోని 20 షాపుల్లో 80 శాతానికి పైగా కూటమి పార్టీల సానుభూతిపరులకే దక్కాయి. నూతన మద్యం విధానం 2024–2026లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం మద్యం దుకాణాలకు ఈ నెల 1న టెండర్ల ప్రక్రియ ప్రారంభించింది. టెండర్ దరఖాస్తులు స్వీకరణ మొదటి రోజు నుంచి నియోజకవర్గంలో ప్రహసనంగా మారింది. కూటమి పార్టీల సానుభూతిపరులు తప్ప వేరేవారు దరఖాస్తులు వేయకుండా బెదరింపులకు దిగడం లాంటి చర్యలకు పాల్పడ్డారు. ఆసక్తి ఉన్న వారు స్వేచ్ఛగా దరఖాస్తు వేయలేని పరిస్థితి కల్పించారు. దీంతో నియోజకవర్గంలోని ధర్మవరం, తాడిమర్రి, ముదిగుబ్బ, బత్తలపల్లి మండలాలతో పాటు ధర్మవరం పట్టణంలో మొత్తం 20 మద్యం దుకాణాలకు గానూ 219 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో కూటమి పార్టీల సానుభూతిపరులు వేసిన దరఖాస్తులే ఎక్కువగా ఉన్నాయి. సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన మద్యం దుకాణాల టెండర్ లాటరీ ప్రక్రియలో ధర్మవరం నియోజకవర్గంలో 20 మద్యం దుకాణాలకు గాను 80 శాతానికి పైగా మద్యం దుకాణాలను కూటమి పార్టీల సానుభూతి పరులకే దక్కాయి. 20 శాతం అదీ డిమాండ్ లేని రూరల్ ప్రాంతాల్లోని మద్యం షాపులు మాత్రం తటస్థులకు దక్కాయి. ఆశ్చర్యకరంగా బీజేపీ అనంతపురం జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులుకు ఐదు మద్యం దుకాణాలు దక్కడం గమనార్హం.

తటస్థులు నెట్టుకొచ్చేరా..?

ప్రస్తుత పరిస్థితులలో తటస్థులు మద్యం దుకాణాలు స్వేచ్ఛగా నిర్వహించడం సాధ్యమేనా అన్న ప్రశ్న ఉత్పన్నమౌతోంది. ఇప్పటికే తటస్థులకు కనీసం మద్యం దుకాణం పెట్టుకునేందుకు అద్దె గదులు కూడా ఇచ్చేందుకు ముందుకు రావడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. దీంతో విధిలేక కూటమి పార్టీల నాయకులకే దుకాణాలు అప్పజెప్పేలా ఒత్తిడులు తెస్తున్నట్లుగా తెలుస్తోంది.

ధరల పెంపు కోసం సిండికేట్!

కూటమి పార్టీల నాయకుల ఆధ్వర్యంలో ధర్మవరం నియోజకవర్గంలో సిండికేట్‌గా ఏర్పడేందుకు జోరుగా పావులు కదుపుతున్నట్లుగా తెలుస్తోంది. ఇదే కనుక జరిగితే మద్యం షాపుల్లో మద్యం అధిక ధరలకు విక్రయించినా అడిగేవారే ఉండరు. ఎంఆర్‌పీపై రూ.10 అధికంగా విక్రయించేలా చర్చలు జరుగుతున్నట్లుగా విశ్వసనీయమైన సమాచారం. ధర్మవరం పట్టణంలో సగటున ఒక్కో మద్యం దుకాణంలో రోజుకు రూ.2లక్షల నుంచి రూ.3 లక్షల వరకు మద్యం విక్రయాలు జరుగుతుంటాయి. రూరల్ పరిధిలో అయితే ఒక్కో మద్యం దుకాణంలో రూ.1.50 లక్షల నుంచి రూ.2లక్షల వరకు విక్రయాలు ఉంటాయి. మద్యం సిండికేట్ కనుక జరిగితే పెద్ద మొత్తంలో డబ్బును కూటమి నాయకులు జేబుల్లో వేసుకునే అవకాశం ఉంది. అందుకోసమే ఇంత రిస్క్‌కు సిద్ధపడ్డారని విమర్శలు వస్తున్నాయి.

లాటరీలో మద్యం దుకాణాలు వీరికే..

కదిరి: మద్యం దుకాణాలకు సోమవారం జిల్లా కేంద్రంలో జరిగిన లాటరీలో కదిరి ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని 12 దుకాణాలను దక్కించుకున్న వారి పేర్లను ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సీఐ ఉప్పలపాటి వీరారెడ్డి మీడియాకు వివరించారు. కదిరి మున్సిపల్ పరిధిలోని 60వ షాప్ కందుకూరి గణేష్, 61వ షాప్ కాటం శివశంకర్, 62వ షాప్ శ్రీనివాసరెడ్డి, 63వ షాప్ కందుకూరు గణేష్, 64వ షాప్ మల్లికార్జున, 65వ షాప్ షేక్ రిజ్వాన్ బాషా దక్కించుకున్నారని తెలిపారు. కదిరి రూరల్ పరిధిలోని షాప్ నంబర్ 66 దాసరి సుధాకర్, 67వ షాపు చెన్నకేశవులుకు దక్కాయని పేర్కొన్నారు. తలుపుల మండలంలోని 68వ దుకాణం రమణయ్య, 69వ దుకాణం రేవంత్, ఎన్పీ కుంటలోని 70వ దుకాణం రెడ్డి నాయక్, గాండ్లపెంట మండలంలోని 71వ దుకాణం టంగుటూరి సురేఖ లాటరీలో దక్కించుకున్నారని సీఐ తెలిపారు. ఈ నెల 16 నుంచి వీరి దక్కించుకున్న దుకాణాల్లో మద్యం అమ్మకాలు చేసుకునేందుకు ప్రభుత్వం అనుమతించిందన్నారు.


ధర్మవరం పట్టణ ముఖచిత్రం

మద్యం దుకాణాలు కైవసం చేసుకున్న వారి వివరాలు..

ధర్మవరం మున్సిపాలిటీ

షాప్‌నంబర్	విజేత
1	సందిరెడ్డి శ్రీనివాసులు
2	శ్రీశైలం పురుషోత్తంగౌడ్
3	తాడిమర్రి రవీందర్‌రెడ్డి
4	రుద్ర రవికుమార్
5	సందిరెడ్డి శ్రీనివాసులు
6	కోళ్లమొరం లోక్‌నాథ్‌రెడ్డి
7	కోటిరెడ్డి బాలిరెడ్డి
8	కంపరాజ్ ఆంజనేయులు
9	లింగాల ప్రకాష్‌రెడ్డి
10	డి.జగదీష్

ధర్మవరం మండలం

షాప్‌నంబర్	దుకాణం పొందిన వారు
11	శ్రీశైలం పురుషోత్తంగౌడ్
12	సందిరెడ్డి శ్రీనివాసులు

బత్తలపల్లి మండలం

షాప్‌నంబర్	దుకాణం పొందిన వారు
13	మోదుపల్లి నాగరాజు
14	సందిరెడ్డి శ్రీనివాసులు
15	నరేంద్ర లింగ

తాడిమర్రి మండలం

షాప్‌నంబర్	విజేత
16	కొండపల్లి గణేష్

ముదిగుబ్బ మండలం

షాప్‌నంబర్	విజేత
17	అన్నమనేని శ్రీనివాసులు
18	అన్నమనేని శ్రీనివాసులు
19	సందిరెడ్డి శ్రీనివాసులు
20	దుగ్గిం కిరణ్‌కుమార్

బాధితులకు పరామర్శ


పుట్టపర్తిలో మల్లికార్జునను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి


బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

పుట్టపర్తి టౌన్: ఇటీవల మోకాళ్లకు శస్త్రచికిత్స చేయించుకుని ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న పుట్టపర్తి మున్సిపాలిటీ మూడో వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు బిల్డర్ మల్లికార్జునను సోమవారం మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం బడేనాయక్‌తండాకు చెందిన సోమ్లానాయక్ నూతన గృహప్రవేశానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తుంగా ఓబుళపతి, కౌన్సిలర్లు సూర్యాగౌడ్, చెరువు భాస్కర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ రంగారెడ్డి, మాజీ కౌన్సిలర్ నారాయణరెడ్డి, నాయకులు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి అర్బన్: వెంగళమ్మచెరువు గ్రామంలో సోమవారం పలువురు బాధిత కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పరామర్శించి ధైర్యం చెప్పారు. గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు సుబహాన్ తండ్రి ఇమాంసాబ్, పింజిరి బాబు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు.వీరి కుటుంబాలను దుద్దుకుంట పరామర్శించి, అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. అనారోగ్యంతో బాధ పడుతున్న వడ్డి చిన్నాగప్పను, దస్తగిరిని, బుడ్డన్న గారి రాగెప్ప తదితర కుటుంబాలను పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసారెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ ఈశ్వరరెడ్డి, నాయకులు హనుమంతరెడ్డి, తిప్పారెడ్డి, వెంకటేష, తదితరులు ఉన్నారు.

మృతునికి నివాళి

నల్లమాడ: బాసంవారిపల్లికి చెందిన కుంచపు రమణప్ప (32) అనారోగ్యంతో సోమవారం తెల్లవారుజామున మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి గ్రామానికి వెళ్లి రమణప్ప మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి, ధైర్యం చెప్పారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కె.సూర్యనారాయణ, నాయకులు పెద్ద తిరుపాల్‌రెడ్డి, మాధవరెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, చిన్న తిరుపాల్‌రెడ్డి, ఉత్తప్ప తదితరులు ఉన్నారు.

విద్యుత్ సమస్య పరిష్కారం

ముదిగుబ్బ: కొడవండ్లపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని 14 గ్రామాల విద్యుత్ సమస్యను ఎస్ఈ సురేంద్ర పరిష్కరించారు. సోమవారం సబ్‌స్టేషన్‌ను ఆయన పరిశీలించారు. దీని పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడటంతో రైతులు ఆదివారం సబ్‌స్టేషన్ వద్ద ధర్నా చేసిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో సమస్యను గుర్తించిన ఎస్ఈ పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. ఇక నుంచి వ్యవసాయానికి, గృహావసర విద్యుత్‌కు ఇబ్బందులు ఉండవన్నారు. ఎస్ఈ వెంట ఏఈ శివతేజ తదితరులు ఉన్నారు.

సమాజ సేవలో సత్యసాయి సేవా సమితి


సత్యసాయి చిత్రపటంతో ర్యాలీ నిర్వహిస్తున్న సభ్యులు

ధర్మవరం అర్బన్: సమాజ సేవలో తమవంతు సహకారం అందిస్తున్నామని శ్రీసత్యసాయి సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణరావు, జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణమూర్తి తెలిపారు. పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్‌లోనున్న సుబ్బదాసు సత్రంలో సోమవారం శ్రీసత్యసాయి సేవా సమితి–2 కమిటీని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో గత 21 సంవత్సరాలుగా ప్రతినెలా 24న అన్నదానం, ప్రతి గురువారం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పాలు, బ్రెడ్డు, బిస్కెట్ల పంపిణీ, ప్రతి నెలా 19న మహిళా దినోత్సవం నిర్వహిస్తున్నామని చెప్పారు. పేదలకు ఉచిత వైద్య శిబిరం, మందుల పంపిణీ చేపడుతున్నామని తెలిపారు. నూతన కమిటీ ఎంపిక అనంతరం పురవీధుల్లో సత్యసాయిబాబా భజన పాటలు పాడుతూ ర్యాలీ చేశారు.

విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తత

బత్తలపల్లి: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో విద్యుత్ ప్రమాదానికి గురికాకుండా ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని బత్తలపల్లి ట్రాన్స్‌కో ఏఈ శివయ్య సూచించారు. సోమవారం స్థానిక విద్యుత్ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ తడిసిన కరెంట్ స్తంభాలను తాకరాదని, తడిసిన చేతులతో స్టార్టర్లు కానీ, మోటార్లు కానీ ముట్టుకోరాదని సూచించారు. విద్యుత్ లైనుకు చెట్టు కొమ్మలు తాకుతుంటే సంబంధిత అధికారికి తెలియజేయాలని సూచించారు. పార్కులలో గాని, స్టేడియంలో గాని విద్యుత్ స్తంభాలు ముట్టుకోరాదని, ఇంట్లో ఉన్న స్విచ్ బోర్డులను తడి చేతులతో ముట్టుకోరాదని, ఆరుబయట ఏర్పాటు చేసుకున్న లైట్లను నీటిలో తడవకుండా చూసుకోవాలన్నారు. కరెంట్ వస్తువులను తడి చేతులతో ముట్టుకోరాదని, చిన్న పిల్లలను కరెంట్ వస్తువుల వద్దకు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. క్వార్టర్లలో ఉతికిన బట్టలు ఇనుప తీగలపై వేయకూడదని, గాలి దుమారం, వర్షం వలన తెగిన విద్యుత్ వైర్లను ముట్టుకోరాదన్నారు. ఇంట్లో ఉన్న వాటర్ హీటర్ స్విచ్ ఆఫ్ చేసి ప్లగ్ తీసిన తరువాతనే నీళ్ల పెట్టిన వస్తువులను ముట్టుకోవాలన్నారు. ఉరుములు, మెరుపులతో వర్షం పడేటప్పుడు డిష్ కనెక్షన్ తీసివేయాలన్నారు. వర్షం పడుతున్న సమయంలో టీవీ, ఫ్రిడ్జ్, కంప్యూటర్ స్విచ్‌లను ఆఫ్ చేయకుంటే వైర్లు షార్ట్ సర్క్యూట్ అయ్యే ప్రమాదం ఉందన్నారు. కరెంటు లైను కింద సెల్‌ఫోన్ మాట్లాడవద్దని, ఇంట్లోకి వచ్చే సర్వీసు వైరు డ్యామేజీ అయితే జేఎల్ఎం, ఏఎల్ఎం, ఎల్ఎంల దృష్టికి తీసుకురావాలని ఆయన ప్రజలకు సూచించారు.

బత్తలపల్లి: జిల్లాలో భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ స్వర్ణలత సూచించారు. సోమవారం ఆమె తహసీల్దార్ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ భారీ వర్షాలు కురుస్తున్న సమయంలో ఇంటి బయట ఎవ్వరూ ఉండవద్దని, పిడుగులు పడే అవకాశం ఉన్నందున చెట్లవద్దకు వెళ్లరాదని, పాత మిద్దెలు, మట్టి మిద్దెలలో ఉండవద్దని సూచించారు. సురక్షిత ప్రాంతాలో ఉండాలని తెలిపారు.

ఉపాధి కూలీలకు విరివిగా పనులు


ఎన్పీకుంటలో మాట్లాడుతున్న డీఎల్‌పీఓ అంజినప్ప

ఎన్పీకుంట: ఉపాధి హామీ కూలీలకు విరివిగా పనులు కల్పించనున్నట్లు డీఎల్‌పీఓ అంజినప్ప తెలిపారు. జాబ్‌కార్డు కలిగిన ప్రతి కూలీకీ ఏడాదిలో వంద రోజుల పని కల్పిస్తామని చెప్పారు. 'పల్లె పండుగ–పంచాయతీ వారోత్సవాలు'లో భాగంగా సోమవారం ఎన్పీకుంట, పి.కొత్తపల్లి పంచాయతీల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి సర్పంచులు, అధికారులు భూమిపూజ చేశారు. ఆగస్టు 23న నిర్వహించిన గ్రామసభలలో తీసుకున్న తీర్మాణాలకు అనుగుణంగా పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామన్నారు. ఇందులో భాగంగా ఎన్పీకుంట పంచాయతీ దిగువపల్లి నుంచి నాయనవారిపల్లి వరకు, వంకమద్ది పంచాయతీ బందారుచెట్లపల్లిలో, పి కొత్తపల్లి పంచాయితీలలో సుమారు రూ.86లక్షల వ్యయంతో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో డీఎల్‌పీఓతో పాటు సర్పంచులు అంజినమ్మ, చంద్రకళ, దిల్షాద్, ప్రత్యేక అధికారి సురేంద్ర, ఈఓఆర్డీ మాధవరెడ్డి, ఏపీఓ చంద్రశేఖర్, పంచాయితీ కార్యదర్శులు, సచివాలయ, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

నల్లచెరువు: మండల పరిధిలోని రాట్నాలపల్లి, అల్లుగుండు గ్రామాల్లో సోమవారం ఎంపీడీఓ రఘునాథ గుప్తా ఆధ్వర్యంలో పల్లె పండుగ – పంచాయతీ వారోత్సవాలు సందర్భంగా సీసీ రోడ్డు పనులకు భూమిపూజ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ రమణారెడ్డి, ఈఓఆర్డీ శకుంతల గ్రామస్తులు పాల్గొన్నారు.

తలుపుల : ఉడమలకుర్తి, ఓదులపల్లి, గొల్లపల్లితండా, కుర్లి పంచాయతీలో సోమవారం 'పల్లెపండుగ' నిర్వహించినట్లు ఎంపీడీఓ రామానాయక్, ఏపీఓ హారూన్ రషీద్ తెలిపారు. ఈ పంచాయతీల్లో రూ. 60 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు ఎంపీడీఓ తెలిపారు.

తాడిమర్రి: ఏపీఓ సంజీవరెడ్డి అధ్యక్షతన సోమవారం నిడిగల్లు, నార్శింపల్లి గ్రామాల్లో 'పల్లె పండుగ– పంచాయతీ వారోత్సవాలు' ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచులు వెంగమనాయుడు, నారాయణస్వామి మొక్కలు నాటారు. ఏపీఓ సంజీవరెడ్డి మాట్లాడుతూ ఉపాధి హామీ ద్వారా గ్రామాల్లో సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, మినీ గోకులం పశువుల షెడ్లు, రైతుల పండ్ల తోటల పెంపకం, అమృత్ సరోవర్ నీటి కుంట పనులు కమ్యూనిటీ సోక్‌పిట్లు తదితర కార్యక్రమాలు చేపడతామన్నారు.

బత్తలపల్లి: మండలంలోని నల్లబోయనపల్లి, డి.చెర్లోపల్లి గ్రామాల్లో సోమవారం 'పల్లె పండుగ' సందర్భంగా సీసీ రోడ్లకు భూమి పూజ చేశారు. ఎంపీడీఓ నరసింహానాయుడు మాట్లాడుతూ గ్రామాలలో ఉపాధి హామీ, 15వ ఆర్థిక సంఘం నిధులు, సాధారణ నిధులు కింద గ్రామసభలలో ఆమోదం పొందిన పనులకు భూమి పూజలు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచులు ప్రభాకర్‌రెడ్డి, గుజ్జల రమాదేవి, ఏపీఓ ఆదెప్ప, కార్యదర్శి నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ: మండల పరిధిలోని పెద్ద చిగుళ్లరేవు, ఉప్పలపాడు, రాళ్లఅనంతపురం, నల్లచెర్లోపల్లి గ్రామాల్లో సోమవారం పంచాయతీ వారోత్సవాలు నిర్వహించారు. ముఖ్య అతిథి ఎంపీపీ ఆదినారాయణ పలు పంచాయతీల్లో సీసీ రోడ్లు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయభాస్కర్, ఈఓఆర్డీ దివాకర్, ఏఓ రమణారెడ్డి, ఎంపీటీసీ మంజునాథ్, నాయకులు ఓబిరెడ్డి, క్రిష్ణమూర్తి, గంగాధర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి'ని సద్వినియోగం చేసుకోండి

ధర్మవరం రూరల్: ప్రభుత్వం ఉపాధి హామీ ద్వారా అందించే సబ్సిడీని పండ్లతోటల రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ సాయి మనోహర్ కోరారు. సోమవారం మండల పరిధిలోని చిగిచెర్ల, సుబ్బరావుపేట, గొట్లూరు, తుమ్మల గ్రామాల్లో'పల్లె పండుగ' కార్యక్రమం నిర్వహించారు. చిగిచెర్లలో రైతు సాకే నాగలక్ష్మమ్మ పొలంలో మామిడి సాగు కోసం గుంతలు తీసే పనులకు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఏపీఓ అనిల్‌కుమార్‌రెడ్డి, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ ఓబిరెడ్డి, టీఏలు చంద్రకళ, నాగేంద్ర, భారతి, లక్ష్మీనారాయణ, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

చెన్నేకొత్తపల్లి: మండలంలో ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు డీఎస్సీ ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోవచ్చని ఎస్సీ బాలుర వసతి గృహం అధికారి శంకర్ ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఈనెల 21వ తేదీలోపు జ్ఞానభూమి పోర్టల్‌లో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. ఈ అవకాశాన్ని ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వసంతోత్సవం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో దసరా శరన్నవరాత్రుల ఉత్సవాలు ముగియడంతో సోమవారం ఆర్యవైశ్య సంఘం సభ్యులు వసంతోత్సవం నిర్వహించారు. వాసవీమాతను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. ఆర్యవైశ్య యువజన సంఘం సభ్యులు, యువకులు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ కనుల పండువగా వసంతోత్సవం జరుపుకొన్నారు.

మీ సేవలు వెలకట్టలేనివి


ఉద్యోగులను సత్కరిస్తున్న ఎంపీపీ, అధికారులు

పుట్టపర్తి అర్బన్: ఉద్యోగుల సేవలు వెలకట్టలేనివని ఎంపీపీ ఏవీ రమణారెడ్డి పేర్కొన్నారు. సోమవారం పుట్టపర్తి ఎంపీడీఓ కార్యాలయం నుంచి ఇతర మండలాలకు బదిలీపై వెళ్తున్న ఈఓఆర్డీ అశోక్‌కుమార్‌రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ సుబ్రహ్మణ్యం, పంచాయతీ కార్యదర్శులు జయపాల్‌రెడ్డి, తేజ, పుష్ప, శివశంకర్, మహమ్మద్ అజిత్ లను ఘనంగా సత్కరించారు. ఎంపీపీ మాట్లాడుతూ బదిలీ అయిన వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ఇందిరాబాల, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ ఏఈపై ఆగ్రహం


అభివృద్ధి కార్యక్రమాలకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే సింధూరరెడ్డి

పుట్టపర్తి టౌన్: కొత్తచెరువు విద్యుత్‌ఏఈ శ్రీనివాసులుపై ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం 'పల్లె పండుగ'కు కొత్తచెరువుకు విచ్చేసిన ఎమ్మెల్యేకు స్థానికులు విద్యుత్ సమస్యలపై ఫిర్యాదు చేశారు. గతంలో కూడా విద్యుత్ సమస్యలపై ఫోన్ చేస్తే స్పందించలేదని ఎమ్మెల్యే మండిపడ్డారు. మండల సర్వసభ్య సమావేశంలో విద్యుత్ సమస్యలు 10 రోజుల్లో పరిష్కరిస్తామని చెప్పి పట్టించుకోకపోవడం ఏంటని మందలించారు. పద్ధతి మార్చుకుని బాధ్యతగా పనిచేయాలంటూ హెచ్చరించారు. అనంతరం పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే భూమి పూజ చేశారు.

ఆర్టీసీ ఉద్యోగుల నిరసన

ధర్మవరం అర్బన్: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఏపీ పీటీడీ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ధర్మవరం ఆర్టీసీ డిపోలో ఉద్యోగుల పనిభారానికి నిరసనగా తొమ్మిదో రోజు సోమవారం రాత్రి ఎర్ర బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు కేబీ నాగార్జునరెడ్డి, డిపో కార్యదర్శి ముస్తఫాలు మాట్లాడుతూ ఆర్టీసీ డీఎం చర్చల పేరుతో పిలిచి కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ ఏడీసీ మల్లికార్జున, ఉద్యోగులు నజీర్ సాహెబ్, మాధవి, మహదేవ, రహంతుల్లా, జీఆర్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

రాంప్రసాద్‌కు ఎస్కేయూ డాక్టరేట్



అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని ఎంబీఏ విభాగంలో పరిశోధన చేసిన కె.రాంప్రసాద్‌కు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం పట్టణానికి చెందిన రాంప్రసాద్ ప్రొఫెసర్ పంతుల మురళీకృష్ణ పర్యవేక్షణలో 'మేనేజ్‌మెంట్ ఆఫ్ అసెట్స్ ఇన్ ఇండియన్ బ్యాంకింగ్ సెక్టార్ – ఏ కంపారిజన్ స్టడీస్ ఆఫ్ సెలెక్ట్ బ్యాంక్స్' అనే అంశంపై పరిశోధన చేశారు. పలు జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్‌లో ప్రచురితమయ్యాయి.